## పురోగతిలో కొత్వాల్‌గూడ ఎకో పార్కు పనులు

### మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు కింద పూర్తి చేసేందుకు కార్యాచరణ

సిటీబ్యూరో, మార్చి 20 (నమస్తే తెలంగాణ): కొత్వాల్‌గూడ ఎకో పార్కు పనులు పురోగతిలో ఉన్నాయని, దశల వారీగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తున్నదని హెచ్ఎండీఏ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎకో పార్కు నిర్మాణం కోసం గత ప్రభుత్వం జీ.వో.ఎం.ఎస్. నం.40 (21-02-2022) ప్రకారం ఇచ్చిన పరిపాలన అనుమతుల ప్రకారం రూ.75 కోట్లతో పనులు చేపట్టామని తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు బోర్డు వాక్, బర్డ్ ఎవియెరి, పార్కింగ్ ఎంట్రెన్స్, పాత్‌వేస్, అప్రోచ్‌రోడ్డు, బట్టర్ ఫ్లై పార్కు, గ్రీనరీ ల్యాండ్ స్కేపింగ్ పనులు చేపట్టామన్నారు. అదేవిధంగా మరిన్ని పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినా అవి పూర్తి కాలేదని, కొన్ని పనులను పీపీపీ విధానంలో చేపట్టాలని నిర్ణయించినా, వాటిని చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాలేదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్టును చేపడుతున్న నేపథ్యంలో అందులో భాగంగానే కొత్వాల్‌గూడ ఎకో పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.


## బీఈడీ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 20 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 2వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలను ఓయూ వెబ్ సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## పే స్కేల్‌ను బట్టి పీఆర్సీ ఇవ్వండి

సుల్తాన్‌బజార్, మార్చి 20 : పే స్కేల్‌ను బట్టి తమకు పీఆర్సీ అందజేయాలని కోరుతూ తెలంగాణ ఆర్థిక శాఖ అధికారులు బుధవారం రెండవ పీఆర్సీ అధికారుల కమిటీకి నివేదికను అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక అధికారుల బృందం బుధవారం నుంచి ప్రభుత్వంలోని వివిధ ప్రధాన శాఖల అధికారిక సంఘాలతో చర్చలు ప్రారంభించింది. ఈ క్రమంలో మొదటి రోజు బుధవారం ఆర్థిక శాఖ విభాగం డీఏఓల సంఘం అధికారులతో చర్చలు జరిపారు. ఈ క్రమంలో ఆర్థిక విభాగం ప్రతినిధులు పే స్కేల్‌ను బట్టి పీఆర్సీ అందజేయాలని కోరారు. మొత్తం ఆర్థిక పరమైన 11 సూచనలు, సర్వీస్ పరమైన 9 సూచనలు ప్రతిపాదించినట్లు సంఘం అధ్యక్షుడు మొహినుద్దీన్, కార్యదర్శి రాధా రమణా రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఆశం, కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట రమణ, ఉషా రాణి పాల్గొన్నారు.

## టీ హబ్‌లో గ్రోత్ సమ్మిట్



సిటీబ్యూరో, మార్చి 20 (నమస్తే తెలంగాణ): ఆర్థిక వ్యవస్థ వృద్ధికి స్టార్టప్‌లు దోహదం చేస్తాయని, అలాంటి స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు టీ హబ్‌లో నిరంతరం పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని టీహబ్ సీఈఓ ఎం.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం టీ హబ్‌లో భవిష్యత్ ఆర్థిక అంశంపై ప్రత్యేకంగా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుల్లో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ టీహబ్ వేదికగా కొత్త ఆలోచనలతో వచ్చే స్టార్టప్‌లకు అనుకూలమైన వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా కొత్తగా అభివృద్ధి చెందుతున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలతో నేటి యువతరం స్టార్టప్‌లను ఏర్పాటు చేసి, విజయవంతంగా కార్యకలాపాలను నిర్వహించాలన్న లక్ష్యం కలిగి ఉన్నారు. అలాంటి వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించడం ద్వారా ఆర్థికంగా వృద్ధి చెందేందుకు అవకాశాలున్నాయని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

నగరంలో

# కాంప్రహెన్సివ్ పార్కింగ్స్

### మొబైల్ యాప్‌లో పార్కింగ్ స్థలాల వివరాలు

### ప్రకటనలతో ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలి

### సమీక్షలో కమిషనర్ రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ ప్రజలకు పార్కింగ్ ఇబ్బందులు లేకుండా పూర్తి ప్రణాళికను రూపొందించాలని, ఆర్గనైజింగ్ పార్కింగ్ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ రొనాల్డ్ రాస్ అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ చర్చించారు. కాంప్రహెన్సివ్ పార్కింగ్ పాలసీ తయారు చేయుటకు అధికారులు విధివిధానాలను సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశించారు. టూ వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్‌తో పాటు భారీ వాహనాలు ఎక్కడెక్కడ పార్క్ చేయడానికి అవకాశం ఉందో అలాంటి అనువైన స్థలాలను గుర్తించాలని చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్ నాయక్‌ను ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఇప్పటికే స్థలాలు గుర్తించినప్పటికీ సరైన నిర్వహణ లేకపోవడం మూలంగా పార్కింగ్ వినియోగించుకోవడం లేదని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా 4 వీలర్ పార్కింగ్, ద్విచక్ర వాహనాల కోసం ప్రత్యేక స్థలాలు గుర్తించాలని సూచించారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో పయనించే వాహనదారులకు ఆయా ప్రాంతాల్లో వాహనదారులు పార్కింగ్ చేసుకునేలా అందుబాటులో ఉన్న పార్కింగ్ స్థలాల వివరాలు ప్రత్యేక పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా గుర్తించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు కమిషనర్ సూచించారు. పార్కింగ్ స్థలాల వద్ద అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా నగరంలో ఖాళీగా ఉన్న ప్రైవేటు స్థల యజమానులు పార్కింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ముందుకు వచ్చిన పక్షంలో వారు పాటించాల్సిన నియమ నిబంధనలు తయారు చేయాలన్నారు. ముఖ్యంగా మెయిన్ రోడ్డుతో పాటు ట్రాఫిక్ రద్దీగా ఉండే కాలనీ రోడ్లను గుర్తించి అనువైన స్థలాలను గుర్తించాలని పేర్కొన్నారు. ఆదే విధంగా కమర్షియల్ మాల్స్ వద్ద కూడా వాహన పార్కింగ్ సౌకర్యం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్కింగ్ స్థలాల వద్ద ప్రకటనల ద్వారా జీహెచ్ఎంసీ ఆదాయం పెంచడం కోసం ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా ఏజెన్సీ పార్కింగ్ సంబంధించిన నిర్మాణ నమూనాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కమిషనర్ పరిశీలించారు. ఈ సమావేశంలో ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, ఈఎన్సీ జియా ఉద్దీన్, అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్, సీసీపీ రాజేంద్రప్రసాద్ నాయక్, ప్రాజెక్టు సీఈ దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

## కాటేదాన్ మార్షబాయి కుంట రక్షణకు చర్యలు

సిటీబ్యూరో, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్‌లోని మార్షబాయి కుంట రక్షణకు చర్యలు చేపట్టామని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. మార్షాబాయి కుంటలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ప్రాంతంలో కబ్జాదారులు నిర్మాణ శిథిలాలు, వ్యర్థాలను డంప్ చేసినట్లు తమ దృష్టికి రావడంతో స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ సంబంధిత స్థలాన్ని సందర్శించి శిథిలాలు తొలగించాలని స్థానిక ప్రజలను కోరినట్లు పేర్కొన్నారు. ట్యాంక్ పరిధిలోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో డంప్ చేసిన నిర్మాణ శిథిలాలు, వ్యర్థ పదార్థాలను తొలగించి ట్యాంక్‌ను ఆక్రమణదారుల నుంచి రక్షించినట్లు తెలిపారు. ట్యాంక్ ఎఫ్‌టీఎల్, బఫర్‌లో తదుపరి ఆక్రమణలు జరుగకుండా చూడాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. నిందితులపై ఎఫ్ఐఆర్ ఫైల్ చేయడానికి మైలార్‌దేవ్‌పల్లి పీఎస్ ఎస్‌హెచ్‌ఓకు సూచించినట్లు పేర్కొన్నారు.



కాటేదాన్‌లోని మార్షబాయి కుంటలో పోసిన వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

## ఎల్‌సీ ఇవ్వకుంటే.. విద్యుత్ మరమ్మతులు ఎలా చెయ్యాలి.?

- ఏర్పాట్లు చేసుకొమ్మని.. ఎల్‌సీ ఇవ్వకపోవడం సరికాదు
- ఎస్ఈ కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్లు ఆందోళన



ఆటోనగర్‌లోని ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న తెలంగాణ విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులు

మన్సూరాబాద్, మార్చి 20 : నూతనంగా ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లకు కనెక్షన్లు, విద్యుత్ మరమ్మతుల కోసం లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) ఇవ్వకుండా విద్యుత్ అధికారులు వేదింపులకు గురి చేస్తున్నారంటూ తెలంగాణ విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులు బుధవారం ఆటోనగర్‌లోని ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా నిర్మించిన అపార్ట్‌మెంట్లకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని.. అదేవిధంగా రోజు రోజుకు పెరుగుతున్న ఎండల దృష్ట్యా విద్యుత్ వినియోగం పెరగడం వలన విద్యుత్ మీటర్ల కేటగిరి మార్పులు చేయాల్సి ఉంటుందని తెలిపారు. వర్క్ ఆర్డర్లు వచ్చిన తరువాత సదరు పనుల కోసం అనుమతులు పొందినప్పటికీ కొందరు విద్యుత్ అధికారుల వలన పనులు చేపట్టేందుకు నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సుమారు 2 నెలలుగా ఎల్‌సీలు ఇవ్వకపోవడంతో వినియోగదారుల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తుందని తెలిపారు. ఎట్టకేలకు బుధవారం మధ్యాహ్నం ఎల్‌సీ ఇస్తున్నామని.. పనులు చేసుకోవాలని మంగళవారం విద్యుత్ అధికారులు తెలిపారన్నారు. పనుల కోసం అన్ని ఏర్పాట్లు చేసుకున్న తరువాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎల్‌సీలు ఇవ్వడం లేదని గంట ముందు చెప్పి తప్పించుకున్నారని మండిపడ్డారు. ఎల్‌సీ కోసం ఇలా వేదింపులకు గురి చేస్తే పనులు ఎలా చేసుకోవాలని ప్రశ్నించారు. ఆందోళన చేస్తున్న తెలంగాణ విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులతో ఎస్ఈ కరుణాకర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతోనే ఎల్‌సీలు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్లు ప్రదీప్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## నారాయణగూడలో శ్రీకృష్ణ స్వీట్స్ 4వ స్టోర్ ప్రారంభం

హిమాయత్‌నగర్, మార్చి 20 : అంతర్జాతీయ స్థాయిలో శ్రీకృష్ణ స్వీట్స్‌ను సరఫరా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు శ్రీకృష్ణ స్వీట్స్ సీఈవో హేమంత్ తెలిపారు. బుధవారం నారాయణగూడ, వైఎంసీఏ సమీపంలోని లెజెండ్ లీఫ్ కాంప్లెక్స్‌లో శ్రీకృష్ణ స్వీట్స్ 4వ స్టోర్‌ను చార్మినార్ క్రిమ్ స్టోర్ ఫౌండర్ గోవింద్ షాతో కలిసి హేమంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 75 స్టోర్‌లు ఉన్నాయని, వాటిలో వందశాతం స్వచ్ఛమైన నెయ్యితో తయారు చేసిన స్వీట్స్‌ను విక్రయించడంలో శ్రీకృష్ణ స్వీట్స్ ముందంజలో ఉన్నదని, నాణ్యత, రుచికి ఎంతో ప్రసిద్ధి గాంచిందన్నారు. కొత్తగా ప్రారంభించిన నారాయణగూడ ఔట్‌లెట్‌తో పాటు అమీర్‌పేట, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో ఔట్‌లెట్‌లు ఉన్నాయని తెలిపారు. తమ స్టోర్‌లో మైసూర్ పాక్‌కు ఎంతో ప్రత్యేక ఉన్నదని, విభిన్న రకాలైన స్వీట్లను సైతం తయారు చేసి అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు హేమంత్ తెలిపారు.

## మెడికవర్ జర్నల్ ఆఫ్ మెడిసిన్ ప్రారంభం

కొండాపూర్, మార్చి 20 : వైద్య రంగంలో సరికొత్త ఆవిష్కరణలు, పరిశోధనలను ప్రోత్సహించడంతో పాటు పరిశోధకులు, కన్సల్టెంట్‌లు, వైద్య విద్యార్థులకు అందుబాటులో ఉంచేలా 'మెడికవర్ జర్నల్ ఆఫ్ మెడిసిన్' (ఎంజేఎం)ను ప్రారంభించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ అన్నారు. బుధవారం హైటెక్‌సిటీలోని మెడికవర్ దవాఖానలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై 'మెడికవర్ జర్నల్ ఆఫ్ మెడిసిన్'ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కృష్ణ, ఎంజేఎం జర్నల్ డిప్యూటీ ఎడిటర్ డాక్టర్ సతీష్ కుమార్ కైలాసం, డాక్టర్ శరత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## టెక్ మహీంద్రా స్మార్ట్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ

బన్సీలాల్‌పేట్, మార్చి 20 : అప్సా, టెక్ మహీంద్రా ఫౌండేషన్ స్మార్ట్ కేంద్రంలో ఉచిత నైపుణ్య శిక్షణ కోర్సును ప్రారంభిస్తున్నామని స్మార్ట్ శిక్షణ కేంద్రం మేనేజర్ షేక్ మౌలా అన్నారు. బస్తీలలో నివసించే పేద, మధ్య తరగతికి చెందిన పదవ తరగతి పాసై, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన 19 నుంచి 27 ఏండ్ల వయస్సు ఉన్న యువతీ యువకులకు మూడు నెలల పాటు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, టైపింగ్, ఇంటర్నెట్, రిటైల్ రంగాలలో ఉచిత శిక్షణ అందించి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గలవారు 9154990135, 84980 89786లో సంప్రదించాలని కోరారు. గాంధీ దవాఖాన ఎదురుగా యాక్సిస్ బ్యాంక్ సమీపంలో ఎవర్‌గ్రీన్ కమ్యూనిటీ హాలులోని శిక్షణ కేంద్రంలో నేరు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

## రెండు చెరువులను కలిపి ఐదువేల ప్లాట్లను ముంచిండ్రు

### ఇరిగేషన్ శాఖ పొరపాటు మాకు గ్రహపాటుగా మారింది

### ప్రజాదర్బార్, ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా.. అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదు

### అమీన్‌పూర్ పెద్ద చెరువు ముంపు బాధితుల జేఏసీ




సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నినాదాలు చేస్తున్న సత్యనారాయణ, బాధితులు

ఖైరతాబాద్, మార్చి 20 : యాభై సంవత్సరాలుగా అన్ని హక్కులు కలిగి ఉండి.. పట్టాలు పొంది ఉన్న తమ ప్లాట్లను చెరువుగా మార్చి తమ పొట్ట కొట్టారని అమీర్‌పూర్ పెద్ద చెరువు ముంపు బాధితులు వాపోయారు. బుధవారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అమీర్‌పూర్ పెద్ద చెరువు ముంపు బాధితుల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చైర్మన్ చిరునామా సత్యనారాయణ మాట్లాడుతూ ఐదు దశాబ్దాల కిందట అమీన్‌పూర్‌లోని సర్వే నం.190 నుంచి 225 నంబర్లలో విస్తరించి ఉన్న 460 ఎకరాల్లో వెనుకబడిన, మధ్యతరగతి వర్గాల వారు ప్లాట్లు కొనుగోలు చేశారు. 5వేల మంది ప్లాట్ ఓనర్లు ఉండగా, 25 పంచాయతీ, హుడా, హెచ్ఎండీఏ లేఅవుట్లు ఈ భూమిలో ఉన్నాయి. నాలుగు సంవత్సరాల క్రితం ఇరిగేషన్ శాఖ అధికారులు 93 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పెద్ద చెరువుతో ఎగువనున్న కొత్త చెరువు ఎఫ్‌టీఎల్‌కు అనుసంధానం చేశారు. అంతటితో ఆగకుండా 460 ఎకరాల్లో విస్తరించి ఉన్న తమ ప్లాట్లను సైతం చెరువులో కలిపివేసి నీటిని వదిలారు. ఫలితంగా ప్లాట్లన్ని చెరువులా మారిపోయాయని వాపోయారు. భారతదేశ చరిత్రలో రెండు చెరువులు కలిపి ఒక ఎఫ్‌టీఎల్ లెవల్ తీసుకురావడం ఎక్కడా లేదన్నారు. ఇప్పటికే ఈ స్థలంలో కొందరు కాంపౌండ్ వాల్స్, బేస్మెంట్, గదులు కూడా నిర్మించుకున్నామని తెలిపారు. మియాపూర్ బస్‌డిపో, నిజాంపేట, బాచుపల్లి తదితర ప్రాంతాల మురికినంత తెచ్చి తమ స్థలంలో డంప్ చేస్తున్నారన్నారు. దీంతో భూగర్భ జలాలు దెబ్బతినడంతో పాటు పిల్లలు రోగాలబారిన పడుతున్నారని, వలస పక్షులు సైతం మరణిస్తున్నాయని వాపోయారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ చేసిన పొరపాటు తమకు గ్రహపాటుగా మారిందన్నారు. 2016లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌కు వెళ్లగా, ఇరిగేషన్, హెచ్ఎండీఏ వారు కౌంటర్ దాఖలు చేయలేక పోవడంతో కేసు డిస్మిస్ అయ్యిందని, 2019లో చెరువు అనేది 93 ఎకరాల్లోనే పెట్టుకోవాలని హైకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. న్యాయమైన తమ సమస్యను పరిష్కరించమని ప్రజా దర్బార్, సంగారెడ్డిలోని ప్రజావాణిలో వందలాది దరఖాస్తులు చేసుకున్నా ఇంత వరకు ఏ అధికారి స్పందించలేదన్నారు. తమ ప్లాట్లు తమకు అప్పగించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధులు, బాధితులు బ్రహ్మానంద రావు, విజయ్ కుమార్ రెడ్డి, నర్సింగ్ రావు, టీవీ రావు, కాసోజు నవనీత పాల్గొన్నారు.

## అడివి బాపిరాజు సంస్మరణ సభ



సమావేశంలో మాట్లాడుతున్న పద్మశ్రీ కొలకలూరి ఇనాక్

ముషీరాబాద్, మార్చి 20 : చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా బుధవారం ప్రముఖ రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు అడివి బాపిరాజు సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా పాల్గొని అడివి బాపిరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ కేవీ రావు, ఎస్‌బీ రామ్, తోట శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.





## 23 మంది సాహితీవేత్తలకు.. కీర్తి పురస్కారాలు

తెలుగు యూనివర్సిటీ, మార్చి 20 : మాతృభాష పట్ల చిన్న చూపు తగదని మెట్రోరైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో విశేష సేవలందించిన 23మంది సాహితీవేత్తలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2022సంవత్సరానికి గాను కీర్తి పురస్కారాలను బుధవారం వర్సిటీ ఆడిటోరియంలో ప్రదానం చేసి సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించుకొని భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య టి.కిషన్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్, విస్తరణ సేవా విభాగం ఇన్‌చార్జి రింగు రామ్మూర్తి పాల్గొని వర్సిటీ విశిష్టతను, పురస్కారగ్రహీతల కృషిని వివరించారు.

### పురస్కారాలు అందుకున్న ప్రముఖులు

ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు పి.శ్రీహరిదాసు(ఆధ్యాత్మిక సాహిత్యం), ఆచార్య చల్లా శ్రీరామచంద్రమూర్తి(ప్రాచీన సాహిత్యం), దాట్ల దేవదానం రాజు(సృజనాత్మక సాహిత్యం), జాలాది రత్న సుధీర్(కాల్పనిక సాహిత్యం), డాక్టర్ జీవీ.రత్నాకర్(అనువాద సాహిత్యం), డాక్టర్ గుర్రం సీతారాములు (అనువాదం), షేక్ మహబూబ్ జాన్ (బాల సాహిత్యం), డాక్టర్ పెరుగు రామకృష్ణ (వచన కవిత), తగుళ్ళ గోపాల్ (వచన కవిత-యువ కవి), ఎన్వీ రఘువీర్‌ప్రతాప్ (తెలుగు గజల్), డాక్టర్ కె.బాలస్వామి (పద్య రచన), మేడిచర్ల ప్రభాకర్‌రావు (పద్యరచన), చొప్పదండి సుధాకర్(కథ), దురికి మోహన్‌రావు (హాస్య రచన), కల్వకోట వెంకటసంతోష్‌బాబు (జీవిత చరిత్ర), దాస్యం సేనాధిపతి (వివిధ ప్రక్రియలు), ఆకెళ్ళ శివప్రసాద్ (బైపాస్, ఉత్తమ నాటక రచయిత), డాక్టర్ పాటిబండ్ల రామ్మోహన్ రావు (జనరంజక విజ్ఞానం), డాక్టర్ సి.శ్రీనివాసరాజు (పరిశోధన), డాక్టర్ బుర్రా మధుసూదన్‌రెడ్డి (పత్రికా రచన)ఆచార్య ఎం.గోనా నాయక్(భాష), డాక్టర్ జి.రఘురామశర్మ (అవధానం) ఎం.భిక్షు నాయక్ (జానపద గాయకులు)లకు పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ.5,116 నగదు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

## 29న టీ-హబ్‌లో నేషనల్ బిజినెస్ లీడర్స్ అవార్డ్స్ ప్రదానం




హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో లోగో ఆవిష్కరిస్తున్న సీహెచ్.భద్ర

హిమాయత్‌నగర్, మార్చి 20 : వ్యాపార రంగంలో యువతను ప్రోత్సహించాలనే సంకల్పంతో ఈ నెల 29న మాదాపూర్‌లోని టీ-హబ్‌లో నేషనల్ బిజినెస్ లీడర్స్ అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్యాక్స్ ఫైలింగ్ ఫౌండర్, సీఈవో చల్లూరి శ్రీనివాస్, ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్.భద్ర తెలిపారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ యువత వ్యాపార రంగంలో రాణించేందుకు మెలకువలు నేర్పిస్తూ వారి ప్రతిభను వెలికితీసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపార వేత్తలు భాగస్వామ్యం కావాలని సూచించారు. రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, ఎంపీ ఆర్.కృష్ణయ్య, మూడు రాష్ట్రాల ఇన్‌కాం ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్, కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ ఓబీసీ నేత రాంప్రకాశ్ మాలి, ఎంబీసీ నేత ప్రదీప్, ప్రతినిధి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో ముదిరాజ్‌లకు సరైన ప్రాతినిధ్యం లేదు

### ముదిరాజ్ అధ్యయన వేదిక చైర్మన్ ప్రొఫెసర్ రాములు




సమావేశంలో నినాదాలు చేస్తున్న ప్రొఫెసర్ రాములు, వరలక్ష్మి తదితరులు

ఖైరతాబాద్, మార్చి 20: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లకు సరైన ప్రాతినిధ్యం ఇవ్వడం లేదని ముదిరాజ్ అధ్యయన వేదిక చైర్మన్ ప్రొఫెసర్ రాములు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనేక కార్పొరేషన్లలో ముదిరాజ్‌లకు అన్యాయం చేశారన్నారు. ఫిషరీస్ కో ఆపరేటీవ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ విషయంలో తీరని అన్యాయం చేశారని, ఇతర సామాజికవర్గానికి అవకాశం కల్పించి ముదిరాజ్‌లను విస్మరించారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ ముదిరాజ్‌లకు అవకాశం కల్పించిందని, కాంగ్రెస్ పార్టీ కూడా కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు బల్ల సత్తయ్య, బి.యాదగిరి, రాష్ట్ర కార్యదర్శులు నీలం దుర్గేశ్, బోళ్ల వెంకట్ ముదిరాజ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మందుల వరలక్ష్మి, శానబోయిన రాజ్ కుమార్, చొప్పరి సోమయ్య, నీల రాజు తదితరులు పాల్గొన్నారు.